

# పసిడిమనసులు

## - షర్మిల



# మర్రిపాలెం హాల్ట్

**మర్రిపాలెం** నుంచి కాన్వెంట్ జంక్షన్ కి ఎళ్లాలంటే టికెట్ అర్ధరూపాయి .

ఆ డబ్బులు మిగల్చడానికి మర్రిపాలెం రైల్వే హాల్ట్ దగ్గర సరిగ్గా పొద్దున్న ఎనిమిదింటికి అక్కడ ఆగే రాయగడ పాసింజర్ ఎక్కి, సాయంత్రం అయిదింటికి తిరిగి బయల్దేరే అదే రైల్లో రావడం చేసేదాన్ని.

ఈ తిప్పలన్నీ డబ్బులు ఇంట్లో వాళ్లకి మిగల్చడానికి అనుకునేరు.

ఇంట్లో వాళ్లకి ఈ రైలెక్కి బడికి ఎళ్తన్నామన్న సంగతే చాన్నాళ్లు తెలవదు.

ఆ డబ్బులతో స్కూల్ ఇంటర్వెల్ లో అడ్డమైనవీ (ఇంట్లోవాళ్లు అనే మాట ) కొనుక్కు తినడానికే ఈ రైలు సాహసాలు.

స్కూల్లో ఇంటర్వెల్ లో గేటు బయట వేరు సెనగ పప్పు చెక్కీలు , బిళ్లలు , వెలక్కాయలు , ఉప్పు కారం , షర్బత్ , ఐస్ అమ్మేతారు.

ఐస్ ని కోరి దాని మీద రంగు రంగుల షర్బత్ వేసి ఇస్తే ... ఒకటి కాదు ఇంకొకటి కూడా తినాలని వుంటంద.

అసలు మా ఇంట్లో కరెక్ట్ గా బస్ చార్జీకే ఇచ్చే వారు.

పైగా బయట అమ్మేవాటిని తినకూడదని అర్డరు.

అందుకే రైల్లో వెళ్లి ఆ రూపాయి మిగుల్చుకుని రంగు షర్బత్ తాగి ఐస్ తిని ఏమీ ఎరగనట్టు ఇంటి దగ్గర నటించేదాన్ని

బయటవి కొనుక్కోకుండా మా హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ ఫిలిప్పా మాకు స్కూల్ లోపలే బెల్లం వేరుసెనగ పప్పు వేసి టాఫీలు చేయించి అమ్మించేది .

కానీ బయట తిళ్లమీద వున్న మోజు ఈ టాఫీ మీద లేదు. మర్రిపాలెం హాల్ట్ దగ్గర రైలు ఎక్కేది నేనొక్కదాన్నే కాదు. చుట్టుపక్కల వున్న ఐదారుగురు పిల్లలు, కొంతమంది రైల్వే ఉద్యోగస్తులు, చేపా జెల్లా కొనుక్కోటానికి హార్బర్ కి ఎళ్లే చేపలమ్మిలు రైల్వే హాల్ట్ దగ్గర చేరేవారు. చుట్టను కాలుతూ వున్న వైపు నోట్లో పెట్టుకుని పొగపీల్చేవారు ఆ ఆడాళ్లు. వాళ్ల నోరు అంటే మాకే కాదు అందరికీ హడల్ .

మర్రిపాలెం చేపలమార్కెట్ లో బేరాలు ఎక్కువ ఆడేవాళ్లను " మొకం చూడు, కొనీ ముకమేనేటి? నాను ఇయ్యను" అని అనేసేవారు.

వాళ్లకి నచ్చితే నాలుగు చేపలు ఎక్కువ ఇచ్చి "పట్టుకుపో బావూ ఏటిపోతాది" అని మహా ఉదారత ప్రదర్శించేవారు .

రైలు మర్రిపాలెం హాల్ట్ దగ్గరికి రాగానే జనమంతా తోసుకుని ఎక్కాలి. ఎందుకంటే రెండునిమిషాలకన్నా ఆగదు. ఈ సందట్లో పొరపాట్న కాలు తొక్కామా " ఓలమ్మ ! ఏటీ గుంట కాలు మట్టేసినాదీ "అని అరుపులు. రైలెక్కితే ఐదే నిమిషాల్లో స్టేషన్ వచ్చేస్తుంది .

దారిలో కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట దాటితే రైల్వేస్టేషనే !

స్టేషన్లో దిగి వెనకవైపు రైల్వే క్వార్టర్లలో నుంచి నడుచుకుంటే మా స్కూల్ వచ్చేస్తుంది.

మా ఇంటి ఎదురుగా వున్న మైదానంలో దూరంగా వున్న రెండుమూడు క్వార్టర్లలో ఒక క్వార్టర్లో వుండే రాజేశ్వరి కూడా రైలులో

మాతో పాటు వచ్చేది. రోజూలాగే ఆ రోజూ రైలులో వచ్చి స్టేషన్లో దిగాం. స్కూల్ టైం అయిపోతుందన్న హడావిడిలో ఎవరికి వాళ్లం హడావిడిగా పట్టాలు దాటి వెనకవైపు నుంచి స్కూల్ కి వచ్చేశాం.

ప్రేయర్ అయ్యాక ఫస్ట్ అవర్ అవుతుండగా మా సిస్టర్ ఫిలిప్పా వచ్చి " ఈ క్లాస్ లో మర్రిపాలెం నుంచి వచ్చిన పిల్లలున్నారా"? అని మమ్మల్ని చూస్తూ అడిగింది .

నాకు గుండె జారిపోయింది. మేం ఏం తప్పు చేసివుంటామా అని అలోచిస్తూ, ఫిలిప్పా చేతిలో ఆడే బెత్తం వైపు చూస్తూ లేచి నిలబడ్డాను .

" నాతో రా !"అంది .

అసలే నాకు ఆవిడంటే చచ్చే భయం ... ఎందుకు రమ్మందో తెలియదు , బిక్కచచ్చిపోయి ఆమె వెంట ఆఫీస్ రూం కి నడిచాను.

"నీకు రాజేశ్వరి తెలుసా ?" అడిగింది ,

"తెలుసు ఇద్దరం కలిసి వస్తాం, తను 7th A సెక్షన్ " అన్నాను .

" ఊ ! తన ఇల్లు నీకు తెలుసా ?" అంది.

"తెలుసు" అన్నా .

"సరే నాతో రా !" అంది. బాగ్ తీసుకుని సిస్టర్ ఫిలిప్పాతో వాన్ ఎక్కాను.

రైల్వే స్టేషన్ దగ్గర ఆపి లోపల పట్టాల వైపు నడిచింది, ఆమెతో పాటు నేనూ.

అక్కడ రాజేశ్వరి పట్టాల మీద పడివుంది. తల నుంచి రక్తం ధారలుగా మొహం అంతా కారి వుంది. అక్కడున్నవాళ్లు ఎవరో ఫిలిప్పాకి చెబుతున్నారు "ఈ పాప పట్టాలు దాటుతున్నప్పుడే రైలు బోగీలు షంటింగ్ చేస్తున్నారండీ? పాపం ఆ అమ్మాయి తల మధ్యలో చితికి పోయింది . అక్కడికక్కడే చచ్చిపోయింది . ఆ పుస్తకాల మీద అమ్మాయి పేరు , స్కూల్ బాడ్జి చూసి మీకు కబురు చేశాం."

ఇందాక నాతోపాటు రైలెక్కిన రాజేశ్వరి చనిపోయిందంటే నమ్మలేక అయోమయంగా చూస్తూ వుండి పోయాను.

సిస్టర్ ఫిలిప్పా రాజేశ్వరి పక్కనే నుంచుని దేముడిని ప్రార్ధించింది. తరవాత నన్ను వాన్ ఎక్కించుకుని రాజేశ్వరి ఇల్లు చూపించడానికి తీసుకెళ్లింది. నేను ఇల్లు చూపించి ఇంటికి వచ్చేశాను. తరవాత వారం రోజులకి మా సిస్టర్ మళ్లీ పిలిపించింది. శుక్రవారం చర్చిలో రాజేశ్వరి కోసం ప్రార్ధనలు జరుగుతాయని వాళ్ల ఇంట్లో వాళ్లని కూడా పిలవాలి కాబట్టి నేను వెళ్లి వాళ్లకి ఈ విషయం చెప్పి రావాలంది.

సరే అని ఆ రోజు స్కూల్ నుంచి తిరిగి వస్తూ రాజేశ్వరి ఇంటికి బయల్దేరాను . ఆ మైదానంలో వున్న వాళ్ల క్వార్టర్ దూరంగా కనిపిస్తూంది. వాళ్ల అమ్మ కాబోలు బట్టలు ఆరేస్తోంది. ఇంకా నేను ఆ ఇంటికి అల్లంత దూరాన వున్నాను .

" తల్లీ రాజీ ! వచ్చావా !! అని వాళ్ల అమ్మ ఎదురు పరిగెత్తుకుని వచ్చి నన్ను గట్టిగా వాటేసుకుని ముద్దులు పెట్టేసింది. కాసేపటికి తేరుకుని గొల్లున ఏడ్చింది.

" అమ్మా! నువ్వు స్కూల్ డ్రెస్ ఏసుకుని నడిచి వస్తుంటే నా కూతురే తిరిగొచ్చిదనుకున్నా తల్లీ ! " అని ఏడుస్తుంటే నాకేమన్నా అయితే మా అమ్మ కూడా ఇట్లాగే ఏడుస్తుందేమో అనిపించింది .

మర్నాడు స్కూల్ కి తయారై " అమ్మా ! బస్ చార్జీ తో పాటు నాకు ఇంకో అర్ధ రూపాయి ఇవ్వు" అన్నా .

చేతిలో మరో రూపాయి పెడుతూ అమ్మ అంది " ఇప్పుడు నువ్వు రైలెక్కవుగా " అని ...

*(వచ్చేనెల మరో కథ)*